క్లుప్తంగా

పంచాయతీ రాజ్ ఏఈఈకి నివాళి



అచ్చంపేట రూరల్: పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ ఏఈఈ నరేందర్ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు హాజరై నరేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వరప్రసాద్, జితేందర్‌గౌడ్, పర్వతాలు, రామకృష్ణ, బలరాం, దేశ్యానాయక్, పర్వతాలు, మల్లేష్, వివిధ ప్రజాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన వాల్మీకి బోయ సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మొత్తం 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మురళి, హనుమంతురావుతోపాటు పెద్దపల్లి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి సింహగర్జనను విజయవంతం చేయండి

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ముదిరాజుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకుడు కృష్ణ, బీఎస్పీ నాయకులు శివశంకర్, రాజేష్‌లు అన్నారు. శనివారం మండలంలోని తాళ్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజుల రాజకీయ చైతన్యం కోసం సింహగర్జన సభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ముదిరాజు కులస్తులు, ఆత్మీయులు, విద్యావంతులు, మేధావులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఇంటింటికీ బీఎస్పీ ప్రచారం



కొల్లాపూర్: పట్టణంలో బీఎస్పీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ఈసీ మెంబర్ గగనం శేఖరయ్య కూలీలను, చిరు వ్యాపారులను కలిసి పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాలను వివరించారు. టిఫిన్ సెంటర్ నిర్వాహకులతో ముచ్చటించారు. కరపత్రాలను పంచిపెట్టారు. జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య, నాయకులు కాటం విష్ణుతేజ, పోతుగంటి బాలకృష్ణుడు తదితరులున్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



తాడూరు: మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ యాదమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించారు. మరో రెండు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు అనిల్, శ్రీనివాసులు పేర్కొన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణంలో పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయని వివరించారు.

స్వర్ణకారులకు మినహాయింపు ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఎలక్షన్ కోడ్ నుంచి స్వర్ణకారులకు మినహాయింపు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కొండోజి రవీంద్రాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్, ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించారు. వృత్తిరీత్యా కష్టమర్ల బంగారు ఆభరణాల తయారీ కోసం తరుచుగా హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుందని దీనిని దృష్టిలో ఉంచుకొని స్వర్ణకారులకు కోడ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు చారి, భిక్షపతిచారి, పలువురు స్వర్ణకారులు పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

● నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో ప్రతిష్ఠించనున్న దుర్గామాత విగ్రహం



కల్వకుర్తిలో వాసవీ మాత



నాగర్‌కర్నూల్ కన్యకాపరమేశ్వరి దేవాలయం

కందనూలు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిడిదొడ్డి శ్యాంసుందర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల శివాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 8:30 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంతోపాటు మండలంలోని రఘుపతిపేట, మార్చాల, జీడిపల్లి, ఎల్లికల్, తోటపల్లి తదితర గ్రామాలలో దసరా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో దాదాపు 10 వరకు దుర్గా మండపాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కొల్లాపూర్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు అయ్యాయి. పట్టణంలోని వరిదేల శమీ వృక్షం ఎదుట అమ్మవారి మండపాన్ని నిర్మించారు. ప్రధాన ద్వారాన్ని ఆలయ గోపురం తరహాలో ఏర్పాటు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు కాంసానిపల్లి, తాడూరు, పెనిమిళ్ల, వెల్టూరు తదితర గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠాపనకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



కొల్లాపూర్‌లో గోపురం ఆకృతిలో ఆకట్టుకుంటున్న సెట్టింగ్

పథకాల అమలుపై ఫిర్యాదులా!

కొల్లాపూర్: దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాల అమలుపై మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు ఫిర్యాదులు చేయడంపై బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. శనివారం కొల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వొద్దంటూ వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లకు, ఎన్నికల అధికారులకు జూపల్లి ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. 19 ఏళ్ల అధికారంలో ఉండి కొల్లాపూర్‌కు ఏమి చేయలేదని, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులపై, నియోజకవర్గ అధికారులపై, పోలీసులపై నిరంతనం ఫిర్యాదులు చేస్తున్న జూపల్లి తీరును ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. అధిష్ఠానం నుంచి బీఆర్‌ఎస్‌కు డబ్బు సంచులు వస్తాయని జూపల్లి చెప్పడం హాస్యాస్పదం అన్నారు. గతంలో ఆయనకు ఎన్ని వచ్చాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావాలంటే మనకు సమీపంలోనేని కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి చూడాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న హామీలను ఎవ్వరూ నమ్మడం లేదన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధం కావాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని కాని, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని కాని అనవసరంగా విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. సమావేశంలో ఎంపీపీలు కమలేశ్వర్‌రావు, బోజ్యానాయక్, నాయకులు చంద్రశేఖరాచారి, బండల వెంకటస్వామి, పసుపుల కృష్ణ, బోరెల్లి మహేష్, హరికృష్ణ ఉన్నారు.

నిరుద్యోగి ప్రవళికది ప్రభుత్వ హత్యే



మాట్లాడుతున్న వంశీకృష్ణ

కందనూలు: నిరుద్యోగి ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం వందలాది మంది విద్యార్థుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో నేటికీ విద్యార్థులు కొలువుల కోసం తనువులు చాలించడం బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్ చేతగాని ప్రభుత్వం వల్లే ఉద్యోగాలు రాక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవలిక కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రోహిణి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్, నాయకులు తైలి శ్రీనివాసులు, కొడిదల రాము, శ్రీనివాసులు, ఎండీ నజీర్, ముక్తార్ ఖాజా బాబా, వెంకటేష్ పాల్గొన్నారు.

కేసు నమోదు

అచ్చంపేట రూరల్: నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం గత నెల 20న రాజేష్ అనే వ్యక్తి పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి బైక్‌పై వెళ్తున్నాడు. పాత బజార్ నుంచి ద్విచక్ర వాహనంపై అర్పిత్ అనే యువకుడు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజేష్‌కు తీవ్ర గాయాలవ్వగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. క్షతగాత్రుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

తిరుమలలో భక్త జన మండలి



తెలకపల్లి: తిరుపతి తిరుమల దేవస్థానం ఆహ్వానం మేరకు మండల కేంద్రానికి చెందిన శివరామబ్రహ్మేంద్రస్వామి భజన మండలి సభ్యులు శనివారం తిరుమలలోని అఖండ హరినామ సంకీర్తన భజనలో పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన భక్తులు హరినామ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో శ్రీనివాసాచారి, రామన్‌గౌడ్, ఉమాపతి, వెంకటాచారి, సతీష్, శ్రీదేవి, సుగుణమ్మ, రాధిక, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నూర్పిళ్లు

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): రోడ్లపై రైతులు కల్లాలను ఏర్పాటు చేసి నూర్పిళ్లు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని దేవల్ తిరుమలాపూర్ బీటీ రోడ్డుపై మొక్కజొన్న కంకులను పరిచారు. దీంతో వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు ఎదరవుతున్నాయి. రైతులు రోడ్లపై ధాన్యాలను నూర్పిడీలు చేపడుతున్నారు. రాత్రివేళ మొక్కజొన్న కుప్పలు కనపడక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని వాపోయారు. అధికారులు పట్టించుకొని రోడ్లపై ధాన్యపు కల్లాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



దేవల్ తిరుమలాపూర్ రోడ్డుపై ఏర్పాటు చేసిన మొక్కజొన్న కంకులు

భూసార పరీక్షలపై అవగాహన



రాకొండలో అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు



గోపులాపూర్‌లో

తెలకపల్లి: మండలంలోని రాకొండను శనివారం రాజేంద్రనగర్, పాలెం వ్యవసాయ కళాశాలకు చెందిన రావేఫ్ విద్యార్థులు సందర్శించారు. గ్రామ పంచాయతీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్షలు, సాగునీటి వినియోగంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు తెలుసుకొని పంటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రవంతి, నరేందర్‌గౌడ్, రావేఫ్ విద్యార్థులు, శివశ్రావణి, అమృత, నాగవర్ష, సుమాంజలి, నర్మద, రైతులు పాల్గొన్నారు.

కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండలంలోని గోపులాపూర్‌లో నాగార్జున కంపెనీ సేల్స్‌మెన్ దుర్గాప్రసాద్ రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులపై అవగాహన కల్పించారు. పంటలకు నాణ్యమైన మందులు ఉపయోగించాలని సూచించారు. నాగార్జున కంపెనీ మందులు వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, కంపెనీ యజమానులు పాల్గొన్నారు.

నేడు ప్రచార సభ



వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో నిర్వహించే ప్రచార సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న బైరాపూర్‌లో ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని వివరించారు. సమావేశంలో సంజీవ్‌కుమార్‌యాదవ్, పర్వత్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, శేఖర్, ఎర్రశ్రీనుముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్, నారాయణ, అంజయ్య, అరుణ్‌నాయక్ ఉన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టాలి



అచ్చంపేట రూరల్: వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి చేసే ప్రభుత్వానికే పట్టం కట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న దుకాణాదారులతో మాట్లాడారు. కార్యకర్తలు, ప్రజలతో కలిసి టీ కొట్టు వద్ద టీ తాగారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, రమేష్‌రావు, రహ్మత్, పాలేష్‌యాదవ్, రమేష్, వంశీ పాల్గొన్నారు.

ఎన్నికలకు అడహాక్ కమిటీలు

కల్వకుర్తి: పీసీసీ ఆదేశాల మేరకు నియోజక వర్గ స్థాయిలో ఎన్నికల కోసం గ్రామగ్రామాన అడహాక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాలతో పాటుగా మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు కమిటీల పక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. ఎన్నికలలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు కమిటీల తోడ్పాటు ఉంటుందని ఆయన తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



వెల్దండలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా పూలతో బతుకమ్మలను అలంకరించారు. బతుకమ్మ పండగ సందర్భంగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ నిర్వహించారు. మహిళలు, యువతులు ఆట పాటలను అలరించారు. మహిళలు ఊరేగింపుగా సమీప చెరువుల వద్దకు వెళ్లారు. అక్కడ పూజలు నిర్వహించి చెరువులు, నీటికుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

సామూహిక పితృ తర్పణం సమర్పణ



పితృ తర్పణాలు చేస్తున్న బాలురు

కందనూలు: మహాలయ అమావాస్య పితృ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న జ్ఞాన సరస్వతి బాల కల్యాణ ఆశ్రమం, జ్ఞానేశ్వర సరస్వతి మందిరంలో సామూహిక తిలతర్పణాలు, సామూహిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కళ్యాణ ఆశ్రమ అధ్యక్షులు దొడ్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ చనిపోయిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, గురువులు, దాతల కుటుంబ సభ్యుల ఆత్మలు శాంతించాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు కందడై వరదరాజన్ అయ్యంగార్, ఆలయ ప్రధాన కార్యదర్శి ఏలిమే ఈశ్వరయ్య, విశ్వహిందూ పరిషత్ సభ్యులు శివయ్య గౌడ్, బాలస్వామి, ఆకారపు వేణు,పద్మశాలి సంఘ సభ్యులు మాకం రామాంజనేయులు, భూపాల్ రెడ్డి, గిరి, ఆశ్రమ బాలురు, తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. నిర్మాణం మరిచారు



యాదిరెడ్డిపల్లి నుంచి చెన్నోళ్ల కాలనీకి వెళ్లే దారి

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లి నుంచి చెన్నోళ్ల కాలనీ మీదుగా ఐతోల్‌కు వెళ్లే రహదారిపై కంకర వేశారు. నెలరోజులు కావొస్తున్న నిర్మాణ పనులు జాప్యం కావడంతో రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిధులు మంజూరైనా పనులు పూర్తిచేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. పలు ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి నిర్మాణ పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా మద్యం తరలింపు

ఉప్పునుంతల: అక్రమంగా మద్యం తరలిస్తున్న యువకుడిపై కేసు నమోదైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వివరాల ప్రకారం వంగూరు మండలం చింతపల్లికి చెందిన యువకుడు సాయిగణపతి రెండు కాటన్లు బీరు బాటిళ్లను మండల కేంద్రం నుంచి గ్రామానికి అక్రమంగా తరలిస్తున్నాడు. పోలీసుల తనిఖీలో మద్యం గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ



తెలకపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ బూత్‌తో పాటు పలు గ్రామాలను డీఎస్పీ మోహన్‌కుమార్ సందర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఏ గ్రామంలో ఎన్ని పోలింగ్ బూతులున్నాయి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ వసిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు



కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండల కేంద్రంతో పాటు మంచాలకట్ట, మల్లేశ్వరం, గోపులాపూర్ గ్రామాలలో శనివారం అమావాస్య పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక ఆకుపూజ నిర్వహించి, అన్నదానం చేశారు. పెంట్లవెల్లిలో ఆకుతోట ఆంజనేయస్వామి, మంచాలకట్టలో అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రజలు ఆకుపూజ చేశారని అర్చకులు శివయ్యశర్మ, లోకేశ్వరయ్య తెలియజేశారు.

ఎండుతున్న పంటలు



కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండలంలోని జటప్రోల్, మాధవస్వామినగర్, మల్లేశ్వరం, కొండూరు గ్రామాలలో మొక్కజొన్న, మినుము, వరి పంటలను అత్యధికంగా రైతులు సాగు చేశారు. వర్షాలు సరిగ్గా కురువక పోవడంతో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. దీనికి తోడు విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తుండటంతో ఉన్న పంటలు కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇరుకుగా బ్రిడ్జి.. ప్రయాణికుల అవస్థలు



తాడూరు: మండలంలోని తిరుమలాపూర్ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు అనుసరించుకొని బ్రిడ్జిని నిర్మించారు. రోజురోజుకు పలు గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో గ్రామస్తులకు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నాగర్‌కర్నూల్ చెరువు ఉండడంతో వానాకాలంలో బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు వంతనను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com